# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులతో కలిసి ఈ రోజు భూమి పూజ చేయనున్నారు.**

2. **8 వేల 9 వందల 31 రోజులు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవుల్లో దేశానికి సేవలందించిన నరేంద్ర మోదీకి సామాజిక మాధ్యమం ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.**

3. **ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల సంక్షేమం విషయంలో వెనుకంజ వేయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **నీటి ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పాటు నీటి సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ చెప్పారు.**

==========================

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు హెచ్.డి కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మలతో కలిసి ఈ రోజు భూమి పూజ చేయనున్నారు. ఈ పరిశ్రమను సుమారు లక్షా 36 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ పరిశ్రమ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు.

--------------------------

దేశ చరిత్రలో ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి హోదాలో అత్యధిక కాలం సేవలందించిన వ్యక్తిగా చారిత్రాత్మక రికార్డును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సాధించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 8 వేల 9 వందల 31 రోజులు ఈ పదవుల్లో ఉండి దేశానికి సేవలందించిన నరేంద్ర మోదీకి సామాజిక మాధ్యం ఎక్స్ వేదికగా ఆయన నిన్న అభినందనలు తెలిపారు. ఈ అసాధారణమైన ఘనత దేశ ప్రగతి, శ్రేయస్సు పట్ల ఆయనకున్న అంకిత భావాన్ని, దూరదృష్టి గల నాయకత్వాన్ని, అవిశ్రాంత నిబద్ధతను ప్రతిబింబిస్తుందని

పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలన్న మోదీ దార్శనికత మనందరికీ స్ఫూర్తినిస్తూ, దేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తూనే ఉంటుందని అన్నారు. దేశాన్ని ఉన్నత శిఖరాలకు నడిపిస్తున్న ప్రధానమంత్రికి నిరంతర శక్తి, ఆరోగ్యం, విజయం కలగాలని ఆకాంక్షించారు.

---------------------------

ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల సంక్షేమం విషయంలో వెనుకంజ వేయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహలతో కలిసి ముఖ్యమంత్రి నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఆయన జాతికి అంకితమిచ్చారు. అదేవిధంగా 'రైతు భరోసా' నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

నీటి ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పాటు నీటి సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్, ఉపాధి హామీ పథకం సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు నీటి సంరక్షణ, సరఫరా కార్యక్రమాలు చేపట్టామని సామాజక మాధ్యమం ఎక్స్ లో ఆయన పేర్కొన్నారు. సుస్థిర నీటి వనరుల అభివృద్ధి నుంచి సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ కోసం తీసుకుంటున్న ఈ చర్యలు భవిష్యత్తు అవసరాలకు నీటి భద్రతను కల్పిస్తాయని పేర్కొన్నారు. నిన్న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా.. ప్రతి నీటి బొట్టునూ సంరక్షిద్దాం-మన భవిష్యత్తును రక్షిద్దాం అని ప్రతిన బూనాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

---------------------------

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు కూటమి ప్రభుత్వం బడ్జెట్ లో అత్యధికంగా వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా నెలివాడ గ్రామంలో నిన్న నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించడం కోసం పెట్టే పెట్టుబడిగా ఆయన అభివర్ణించారు. ఖమ్మం జిల్లా లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన నిన్న పరిశీలించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

"మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలు ఈ రోజు ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ పైన చర్చను ఈ రోజు శాసన సభ, శాసన మండలిలో చేపడతారు. అసెంబ్లీలో రెండు బిల్లులు మంత్రులు ప్రవేశపెట్టనున్నారు. ఉభయ సభలు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడతారు.

---------------------------

భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమర యోధులు భగత్ సింగ్ ...., సుఖ్ దేవ్ ..., రాజ్ గురుల ఆత్మార్పణను గుర్తు చేసుకుంటూ ఈరోజు అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు. 1931వ సంవత్సరం మార్చి 23వ తేదీన ప్రస్తుత పాకిస్తాన్‌లోని లాహోర్ పట్టణంలో ఈ ముగ్గురు యోధులను బ్రిటిష్ వలస పాలకులు ఉరి తీశారు. ఈ సంఘటన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఈ అమరవీరుల సేవలను ప్రతి ఏటా మార్చి 23వ తేదీన భారతదేశ ప్రజలు గుర్తు చేసుకుంటూ... ఆ వీరులకు అంజలి ఘటిస్తున్నారు.

---------------------------

దక్షిణ అంతర్గత కర్ణాటక, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించిందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి దక్షిణ మధ్య మహారాష్ట్ర వరకూ, తమిళనాడు, అంతర్గత కర్ణాటక మీదుగా ద్రోణి విస్తరించి కొనసాగుతోందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని తెలియజేస్తూ..

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

రాష్ట్రంలో కోర్టుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో 8 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర రావుతో కలిసి ఆయన నిన్న భూమిపూజ చేశారు.

=====================